క్లుప్తంగా

ప్రశాంతంగా గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌



సూరంపాలెంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని క్యాంపస్‌ డైరెక్టర్‌ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం, సాయింత్రం జరిగిన ఈ పరీక్షలకు 6843 మందికి గాను 4169 మంది అభ్యర్థులు హాజరైనట్టు వివరించారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

రేపు మహాలక్ష్మి అమ్మవారికి పంచహారతులు

తుని రూరల్‌: మండలంలోని ఎస్‌.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి (శ్రీవారి) పుష్కరిణి ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కోనేరు ప్రాంగణంలో కొలువైన దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం 7.30 గంటలకు శ్రీమహాలక్ష్మి అమ్మవారికి పంచహారతులు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

సత్యదేవుని దర్శించిన డీసీసీబీ చైర్మన్‌ వీర్రాజు



రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరిస్తున్న డీసీసీబీ చైర్మన్‌ ఆకుల వీర్రాజు దంపతులు

అన్నవరం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ (డీసీసీబీ) చైర్మన్‌ ఆకుల వీర్రాజు కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్‌ పులి మధు, ఎంపీటీసీ దడాల సతీష్‌, పార్టీ నాయకుడు కొండపల్లి అప్పారావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రత్తిపాడు రూరల్‌: జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైనట్టు ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే..ధర్మవరం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన బి.లక్ష్మి, బి.రాజేష్‌, బి.వైష్ణవి ధర్మవరం నుంచి బైక్‌పై కత్తిపూడి వైపు వెళ్తుండగా ధర్మవరం శివారు ప్రాంతంలో బైక్‌ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ పాలయ్యారు. వారిని వైద్యం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైక్లాస్‌గా తీర్చిదిద్దబడి



నాడు: పంట కాలువలో ప్లేట్లు శుభ్రం చేసుకుంటున్న కోటనందూరు హైస్కూల్‌ విద్యార్థులు



నేడు: సకల సౌకర్యాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన భీమవరపుకోట హైస్కూల్‌

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చేసిన ప్రభుత్వం
- నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- పూర్తిస్థాయిలో వసతుల కల్పన
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కోటనందూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. మన బడి నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా సర్కారీ బడులను తీర్చిదిద్దారు. అత్యాధునిక బోధనా విధానంతో పాటు మౌలిక వసతుల కల్పనలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఫలితంగా చెట్ల కింద కూర్చొని చదవడం, ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడం, పంట కాలువల్లో ప్లేట్లు శుభ్రపరుచుకోవడం వంటి దయనీయ పరిస్థితులకు చరమగీతం పాడారు. తల్లిదండ్రులకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్‌ స్కూళ్లలో చదువుతున్నామనే భావనను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కల్పించారు. ప్రస్తుతతం పల్లెల్లో ప్రభుత్వ బడులు సకల సౌకర్యాలతో సర్వాంగసుందరంగా దర్శనమిస్తున్నాయి.

రూ.42.5 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

కోటనందూరు మండలంలో ఆరు హైస్కూళ్లు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, 21 ఎంపీపీ, కేజీబీవీ పాఠశాలలున్నాయి. మనబడి నాడు–నేడులో భాగంగా తొలి విడతలో 18 పాఠశాలలను రూ.22.5 కోట్లు, రెండో విడతలో 17 పాఠశాలలను రూ. 20 కోట్లతో అభివృద్ధి చేశారు. అవసరానికి మించి తరగతి గదులు, గోడలపై ఆసక్తి కలిగించే బొమ్మలతో పాటు విశాల క్రీడా ప్రాంగణాలు, ప్రహరీ గోడలు ఏర్పాటు చేసి పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో పలు పాఠశాలల్లో విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద కూర్చుని చదువుకునేవారు.



కోటనందూరు ఎంపీపీ పాఠశాలలో బొమ్మలు, అక్షరాలతో తీర్చిదిద్దిన తరగతి గది

కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తాగడం, పంట కాలువల్లో ప్లేట్లు శుభ్రం చేసుకోవడం కనిపించేవి. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో ఆ కష్టాలు కనుమరుగైపోయాయి. తరగతి గదిలో దర్జాగా ఫ్యాన్ల కింద కూర్చొని ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు నేర్చుకుంటున్నారు. ఆర్వో ప్లాంట్లలో మంచినీటిని తాగుతూ కార్పొరేట్‌ టాయిలెట్లలో కాలకృత్యాలు తీర్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి.

తల్లిదండ్రులకు అండగా ప్రభుత్వం

ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే విద్యా కానుక పేరిట విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, షూ, నోటు పుస్తకాలు, బ్యాగులను ప్రభుత్వం అందిస్తోంది. వీటితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకంలో ఏటా రూ.15 వేలు అందించి తల్లిదండ్రులకు అండగా నిలుస్తోంది.

ప్రభుత్వ బడుల్లో సమతుల్య పౌష్టికాహారం

గతంలో ప్రభుత్వ బడుల్లో పురుగుల అన్నం, నీళ్ల సాంబారు, అరకొరగా కూరలు వడ్డించే పరిస్థితులు ఉండేవి. పాఠశాలలో సగం మంది విద్యార్థులు ఇళ్లకెళ్లి భోజనం చేసి వచ్చేవారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో జగనన్న గోరుముద్ద పథకంలో రోజుకొక మెనూతో విద్యార్థులకు నాణ్యమైన సమతుల్య పౌష్టికాహారాన్ని వేడివేడిగా వడ్డిస్తున్నారు. చిక్కీలు, రాగిజావ వంటి న్యూట్రీషన్‌ ఫుడ్‌ అదనంగా అందిస్తుండడంతో విద్యార్థులంతా బడిలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.

చరిత్రలో గుర్తుండిపోయేలా మార్పులు



చరిత్రలో గుర్తుండిపోయేలా సీఎం జగన్‌ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఇప్పుడు బడులు సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి. పుస్తకాలు, యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఇలా అన్ని విషయాల్లో సమూల మార్పులు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. సీఎం జగన్‌ విద్యావ్యవస్థపై చూపుతున్న శ్రద్ధ అభినందనీయం.

– లెక్కల స్వామినాయుడు, రిటైర్డు ఎంఈఓ, జగన్నాథపురం

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- మల్లిసాలలో ఎన్నికల ప్రచారం



మల్లిసాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం సతీమణి వాణి

జగ్గంపేట: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని మల్లిసాలలో ఆదివారం పార్టీ యువనేత తోట రాంజీ సతీమణి శ్రీనిధితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సేవాదళ్‌ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్‌ సీపీ నేత ఎ.శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీదే విజయం



తూర్పులక్ష్మీపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వరుపుల సుబ్బారావు

- ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- తూర్పులక్ష్మీపురంలో గడప గడపకూ..

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీదే విజయమని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో ఆదివారం ఆయన గడప గడపకూ వైఎస్సార్‌ సీపీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్‌ సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్‌ మళ్లీ గద్దె నెక్కడం ఖాయమన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్‌, అడపా పార్థసారథి, నైనాలశెట్టి బాబ్జీ, గాది ఐరాజు, కోరాడ నాగభూషణం, ధారా కృష్ణ, ఉలిపే సత్తిబాబు, తోట అర్జున, వీరంరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు విశేష ప్రజాదరణ

- వైఎస్సార్‌ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- కత్తిపూడిలో ఆత్మీయ సమావేశం

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌ సీపీకి విశేష ప్రజాదరణ ఉందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం పార్టీ కాకినాడ జిల్లా ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ ఆకుల అనుసూయ ఆధ్వర్యంలో ఆత్మీయత సమావేశం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకూ మేలు జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, పార్టీ మండల కన్వీనర్‌ నరాల శ్రీను, కో ఆప్షన్‌ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్‌ సీపీ నాయకులు గాబు గంగ, గౌతు అర్జుబాబు, ఆకుల దేవేంద్రుడు, అడపా సోమేష్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

మొక్కజొన్న సాగు.. లాభాలు బాగు

- వరికి ప్రత్యామ్నాయంగా పండిస్తున్న రైతులు
- ఆరుతడి పంటగా సాగు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు: ప్రస్తుత రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు రైతులకు లాభదాయకంగా మారింది. రబీలో పండే మొక్కజొన్నలు నాణ్యంగా ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మొక్కజొన్నలకు మంచి గిరాకీ ఉంది. ధర కూడా ఆశించిన మేర ఉండటంతో జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

4,048 ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 4,048 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. గోకవరం మండలంలోనే అత్యధికంగా మూడు వేల ఎకరాల్లో సాగు చేపడుతున్నారు. పంట సాగు విధానం, విత్తన శుద్ధి, నాణ్యతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కిర్లంపూడి మండల వ్యవసాయాధికారి జోకా అమృత వివరించారు.

మొక్కజొన్న విత్తనానికి అనువైన సమయం

నీటి ఆధారం లేని ప్రాంతాల్లో మోటార్ల కింద మొక్కజొన్న పంటను సాగు చేసుకోవచ్చు. ఈ నెలాఖరు వరకూ పంట సాగుకు కాలం అనుకూలంగా ఉంటుంది. విత్తనాల్లో ఏటీజే–2, ఏటీజే–4, ఎం35–1, సీఎస్‌వీ 14–ఆర్‌, ఎస్‌వీ 216ఆర్‌, కిన్నెరరాలు, హైబ్రిడ్‌లో సీఎస్‌హెచ్‌–15 ఆర్‌, సీఎస్‌హెచ్‌–16, సీఎస్‌హెచ్‌–13 ఆర్‌ తదతర రకాలను సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తారు. ఎకరాకు నాలుగు కిలోల విత్తనాలు సరిపోతాయి.

విత్తన శుద్ధి ఇలా...

కిలో విత్తనానికి 3 గ్రాముల థైరాయ్‌ లేదా కాప్టాన్‌ కలిపి విత్తన శుద్ధి చేయాలి. తరువాత 3 గ్రామల థియోమిథాక్స్‌ను కలపాలి. దీనివల్ల మొవ్వ తొలుచు పురుగును నివారించవచ్చు. వరుసల మధ్య 45 సెంటీ మీటర్లు, మొక్కల మధ్య దూరం 12–15 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలి. చివరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. తేలిక నేలల్లో 30 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్‌ వేసుకోవాలి. సారవంతమైన నేలల్లో 40 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరం, 60 కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను ఆఖరు దుక్కిలో వేయాలి. నిర్ణీత సమయంలో సాగు చేస్తే పంట ఏపుగా పెరుగుతుంది. గింజ లావుగా ఏర్పడడంతో పాటు గింజలో ప్రొటీన్‌ శాతం అధికంగా ఉంటుంది.

సస్యరక్షణ ఇలా..

మొక్కజొన్న పంటను ఎక్కువగా మొవ్వ తొలుచు ఈగ ఆశిస్తుంది. దీని వల్ల మొవ్వ ఎండిపోతుంది. పక్క పిలకలు ఎక్కువగా వస్తాయి. విత్తనం ఆలస్యమైనప్పుడు అధిక మోతాదులో విత్తనం వేయాలి. 10–12 కిలోల విత్తనాన్ని హెక్టారుకు నాలుగు వరసల్లో వేయాలి. హెక్టారుకు 20 కిలోల కార్బోఫ్యూరాన్‌–3జీ గుళికలు వేయాలి. థయోడికార్‌ 1 గ్రామును లీటరు నీటిలో కలిపి 7 నుంచి 14 రోజుల్లోపు పిచికారీ చేయాలి.



కిర్లంపూడి మండలం వేలంకలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
జగ్గంపేట	35
గండేపల్లి	400
గోకవరం	3,000
కిర్లంపూడి	400
ఏలేశ్వరం	202
ప్రత్తిపాడు	3
రౌతులపూడి	3
శంఖవరం	5
మొత్తం	4,048

రబీలో మొక్కజొన్న సాగు మేలు

రబీ సీజన్‌లో అన్నదాతలు మొక్కజొన్న సాగు చేసుకుంటే ఎంతో మేలు. ఈ పంట సాగుకు పెట్టుబడి ఖర్చు, చీడపీడల సమస్య తక్కువే. పంట మార్పిడి వల్ల భూసారం పెరుగుతుంది. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చే మొక్కజొన్న సాగుపై దృష్టి సారించాలి.

– జోకా అమృత, మండల వ్యవసాయాధికారి, కిర్లంపూడి.

అపర్ణాదేవి నమామ్యహం...!

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, నిర్వహించారు. మూడు వేల మంది మహిళలు పాల్గొన్నారు.



తాటిపర్తిలో అపర్ణాదేవికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

టెన్త్‌ పరీక్షలకు సర్వం సిద్ధం



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ఏలేశ్వరంలో పరీక్షలపై విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ అబ్బాయి

- నేటి నుంచి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఏలేశ్వరం: టెన్త్‌ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షలు ఈ నెల 27 వరకూ జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరగనున్నాయి. ఏలేశ్వరం మండలంలోని ఏలేశ్వరంలో మూడు, లింగంపర్తిలో ఒకటి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్‌ విద్యార్థులు కలిపి మొత్తం 918 మంది పరీక్షలు రాయనున్నారు. ఏలేశ్వరంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాష్యం స్కూల్‌, లింగంపర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

పరీక్ష కేంద్రాలకు పర్యవేక్షణ అధికారుల నియామకం

పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఈ కేంద్రానికి పరీక్షల సూపరింటిండెంట్‌గా వట్టి వెంకటరమణను నియమించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులు, సూపరింటిండెంట్‌గా ఎస్‌.లక్ష్మీతులసి, భాష్యం స్కూల్‌లో 237 మంది విద్యార్థులు సూపరింటిండెంట్‌గా ఎస్‌జే లక్ష్మణరావు, లింగంపర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలలో 248 విద్యార్థులు సూపరింటిండెంట్‌గా ఎం.రజనీకుమారి వ్యవహరించనున్నారు. కాగా విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ బి.అబ్బాయి సూచించారు. విద్యార్థులు మాస్‌ కాపియింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

రౌతులపూడి: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని పరీక్ష కేంద్రాల్లో 610 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ గాడి కొండబాబు తెలిపారు. రౌతులపూడి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల నుంచి 202 మంది, ఎస్‌.అగ్రహారం హైస్కూల్‌ నుంచి 47, ములగపూడి 86, బలరామపురం 25, లచ్చిరెడ్డిపాలెం 34, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 75, రౌతులపూడిలోని సెయింట్‌ థామస్‌ ఇంగ్లిష్‌ మీడియం పాఠశాల నుంచి 18, కోటనందూరు మండలం చిన్నయపాలెం జిల్లా పరిషత్‌ పాఠశాల నుంచి 140 మంది మొత్తం 610 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

ఏర్పాట్లు పూర్తి

గండేపల్లి: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ కేహెచ్‌ నాయక్‌ తెలిపారు. మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు 532 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. తరగతి గదుల్లో విద్యుత్‌ సౌకర్యం, ఫ్యాన్లు, ఫర్నీచర్‌ వంటి సౌకర్యాలు కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ నెల 27 వరకు టెన్త్‌ పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు.

పరీక్షలకు రెడీ

తొండంగి: టెన్త్‌ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగు సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈఓ షేక్‌బాబ్జీ తెలిపారు. బెండపూడిలో 200 మంది, తొండంగిలో 248 మంది, దానవాయిపేటలో 337 మంది, కొత్తపెరుమాళ్లపురంలో 287 మంది పరీక్షలు రాసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తంగా 1072 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు



కిర్లంపూడిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్‌: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచార పోస్టర్లు, ఫొటోలు తొలగించారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, వాల్‌ పోస్టర్లను అధికారులు తొలగిస్తున్నారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. రాష్ట్రంలో జూన్‌ 6 వరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు

కిర్లంపూడి: ఎన్నికల కోడ్‌ అమలులోకి రావడంతో మండల పరిధిలోని గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్‌, ప్రైవేట్‌ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్టు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తెలిపారు.

కోడ్‌ కూసింది.. ముసుగు పడింది

గోకవరం: కేంద్ర ఎన్నికల కమిషన్‌ సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్‌ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్‌ అమలులోకి వచ్చింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో రాజకీయనాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంలో బిజీబిజీగా ఉన్నారు.

50 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్టు

చింతపల్లి రూరల్‌: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు అన్నవరం ఎస్సై పి.రాజారావు ఆదివారం తెలిపారు. వారి నుంచి 50 కిలోల గంజాయి, కారు, ద్విచక్ర వాహనం, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వివరాల్లోకి వెళితే... గంజాయి తరలిస్తున్నట్టు చింతపల్లి సీఐ రమేష్‌కు సమాచారం అందడంతో వెంటనే మండలంలో లోతుగెడ్డ బ్రిడ్జివద్ద ఎస్సై తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కారులో ఒడిశా నుంచి అటవీ ప్రాంతం కోరుకొండ, లోతుగెడ్డ మీదుగా తునికి గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో తమిళనాడుకు చెందిన రోహన్‌దేవ్‌ సత్యన్‌(25), జయశీలన్‌ కృష్ణన్‌(47), కాకినాడ జిల్లా తేటగుంటకు చెందిన కటారి రాజు, (36), మువ్వల బాబ్జి(25)లుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు. పోలీస్‌, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.